క్లుప్తంగా

మంజునాథస్వామి వార్షిక ఆరాధనోత్సవం



మంజునాథస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని మంజునాథ స్వామి ఆలయంలో శ్రావణమాస వార్షిక ఆరాధనోత్సవాలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఆలయంలోని మూలవిరాట్‌కు ఉదయం 6 గంటలకే సుప్రభాత సేవ, 9 గంటలకు మహాజలాభిషేకం, స్వస్తి పుణ్యాహం, కలశపూజ, గణపతిపూజ, 11.30 గంటలకు మంజునాథస్వామికి పంచామృతాభిషేకాలు, సామూహిక ప్రార్థనలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

శ్రావణమాస పూజలు

కూడేరు: కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివ పార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం శ్రావణసోమవారం పూజలు నిర్వహించారు. జోడు లింగాలను దర్శించుకునేందుకు జిల్లా నలమూలల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయ అర్చకులు శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అలంకరణ చేశారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో జోడు లింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

ఉరవకొండ: జిల్లాలో సకాలంలో వర్షాలు రాకపోవడంతో ఈఏడాది ఖరీఫ్ విత్తనసాగు విస్తీర్ణం తగ్గిపోయిందని, కరువు సహాయక చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఒక్క ఖరీఫ్‌లోనే సుమారు ఐదు లక్షల హెక్టార్లలో విత్తనసాగు చేపట్టాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం 80 నుంచి 90 వేల హెక్టార్లలో మాత్రమే సాగయ్యిందన్నారు. కరువు నేపథ్యంలో రైతాంగానికి 2023 ఏడాదికి సంబంధించిన ఖరీఫ్, రబీల్లో పంటలకు ప్రకటించిన బీమా విడుదల చేయాలన్నారు. రైతుల కోసం ప్రభుత్వం ప్రకటించిన రూ.20వేల పెట్టుబడి సాయాన్ని అందించాలన్నారు. హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ పనులు చేసి, కరువు పరిస్థితులను తట్టుకునేలా ప్రభుత్వం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం జిల్లా పరిషత్ జయం ఆదెప్ప సేవా మందిర్ ఉన్నత పాఠశాలలో 9,10వ తరగతుల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు సోమవారం ప్రతిభా పురస్కారాలు అందించారు.ఉత్తమ మార్కులు సాధించిన గౌతమి, అనిత, కిరణ్‌కుమార్, అలేఖ్య, ప్రభంజన్, కార్తీక్, ప్రభాస్‌కు రూ.10 వేల చొప్పున నగదు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సేవా సంఘం సభ్యులు కేఎల్ వెంకటేశులు, హనుమంతప్ప, సత్యనారాయణ, గంగప్ప, పెద్దన్న, రాజగోపాల్, మరియప్ప, మారుతి ప్రసాద్, సువర్ణమ్మ, వన్నూరప్ప, విరూపాక్షి, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున పాల్గొన్నారు.

అమిలినేని జన్మదిన వేడుకలు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. ఉదయం స్థానిక టీ సర్కిల్ నుంచి నగరవనం వరకు గో గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. నగరవనంలో ఆర్డీఓ డాక్టర్ రాణీ సుస్మిత, ఫారెస్ట్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం టీ సర్కిల్‌లో కేక్ కత్తిరించారు. ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ ఆధ్వర్యంలో 11 మందికి రూ.3 లక్షల చెక్కులను అందించారు.

బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం



బాక్సింగ్ క్రీడాకారిణి వందనను సన్మానిస్తున్న దృశ్యం

ఉరవకొండ: భూటాన్ దేశంలో జరిగిన అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో ఉరవకొండ డిగ్రీ కళాశాల విద్యార్థిని వందన బంగారు పథకం సాధించినట్లు మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు మొలకబాల రామాంజనేయులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. సోమవారం డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన సన్మాన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సిరాజ్ అలీఖాన్, జీ.అయ్యన్న, వెంకటకృష్ణయ్య, మస్తాన్, కేవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అందని భరోసా..రైతుకు చింత

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలకుపైనే గడుస్తోంది.. పంటలు సాగుకు పెట్టుబడి సాయం అందక రైతులు అల్లాడుతున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఏటా రూ.20వేల చొప్పున ప్రతి రైతుకూ అందిస్తామని ప్రచారం చేశారు. కానీ అధికారంలోకొచ్చి రెండు నెలలవుతున్నా ఆ ఊసే లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఏటా సీజన్ ప్రారంభం కాగానే రైతు ఖాతాల్లో నగదు జమ అవుతుండేదని, ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – ఉరవకొండ:

- ఎన్నికల ముందు రూ.20 వేలు ఇస్తామని కూటమి నాయకుల హామీ
- జగనన్న హయాంలో ఖరీఫ్ సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం
- కూటమి ప్రభుత్వంలో కన్పించని 'రైతుభరోసా'



ఉరవకొండ వద్ద సేద్యం పనులు చేస్తున్న రైతు

2019 ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో అన్నదాతలకు అండగా నిలిచారు. రైతులకు పంట పెట్టుబడి సాయం కింద ఏటా రూ.13,500 అందించి, ఆదుకున్నారు. 2019 నుంచి వైఎస్సార్ సున్నావడ్డీ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా 2019 నుంచి 2024 వరకు 8,85,696 మంది రైతులకు రూ.987.7 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. సున్నా వడ్డీ రాయితీ ద్వారా 2021 రబీ నుంచి 2024 రబీ వరకు 1,21,612 మంది రైతులకు రూ.32.36 కోట్లు బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు.

పెట్టుబడి సాయం అందక అవస్థలు..

తాము అధికారంలోకి రాగానే రైతులకు పంట పెట్టుబడి కోసం రూ.20 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు బాహాటంగా ప్రకటించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు చిల్లిగవ్వ రైతులకు అందించలేదు. ఖరీఫ్ సీజన్ ముగిస్తున్నా ప్రభుత్వం పెట్టుబడి సాయం ఊసేలేదు. మరోవైపు బ్యాంకులకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ రుణ ప్రణాళిక అందడం ఆలస్యం కావడంతో రైతులకు రుణాలు రీషెడ్యూలు చేయలేదు.

2019 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరయిన రైతు భరోసా నిధులు

నియోజకవర్గం	రైతులు	మొత్తం
ఉరవకొండ	2,51,142	రూ.283.41కోట్లు
రాయదుర్గం	2,17,424	రూ.283.15కోట్లు
కళ్యాణదుర్గం	2,66,787	రూ.347.41కోట్లు

2019 నుంచి 2024 వరకు సున్నా వడ్డీ పథకం కింద మంజూరయిన నిధులు

ఉరవకొండ	36,080	రూ.7.46 కోట్లు
రాయదుర్గం	43,145	రూ.8.8 కోట్లు
కళ్యాణదుర్గం	35,696	రూ7.88 కోట్లు

పెట్టుబడి సాయం అందివ్వరా?



పంటల సాగు ప్రారంభం కావడం వల్ల పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నాం. ఖరీఫ్ సీజన్ ముగిస్తున్నా కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయంపై నోరుమెదపడంలేదు. గత ప్రభుత్వం హయాంలో సీజన్‌కు ముందే సహాయం అందించి, రైతులను ఆదుకున్నారు.

– అనిల్‌కుమార్, రైతు, రమణేపల్లి గ్రామం, బెళుగుప్ప మండలం

హామీ నిలబెట్టుకోవాలి..



అధికారంలోకి వస్తే పంటల సాగుకు రూ.20 వేలు ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఊరూవాడా ప్రచారం చేశారు. దీన్ని నమ్మి రైతులు ఓట్లు వేశారు. సీజన్‌లో పెట్టుబడికి డబ్బులు లేవు. గత్యంతరం లేక పెట్టుబడుల కోసం అధిక వడ్డీలకు ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తోంది.

– మల్లికార్జున,సీపీఎం తాలుకా కార్యదర్శి,ఉరవకొండ

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దు.. అండగా ఉంటామని కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త తలారి రమేష్ కొడుకు తలారి చంద్రను తన ఇంటికెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, నాయకులు కొత్తూరు బాబు, లాయర్ హనుమంతరెడ్డి, నారాయణపురం వెంకటేశులు, మాజీ అక్కమ్మగార్ల ఆలయ కమిటీ చైర్మన్ కిరిటీ యాదవ్, గోళ్ల సూరి, కామక్కపల్లి రామాంజనేయులు, బోరంపల్లి రామిరెడ్డి, తలారి శ్రీకాంత్, తలారి చరణ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరులో కార్యకర్తను పరామర్శిస్తున్న రంగయ్య

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కళ్యాణదుర్గం రూరల్: స్కీం వర్కర్ల తొలగింపు ఆపాలని, తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి కోరారు. సోమవారం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్‌టీసీ బస్టాండ్ నుంచి ఆర్‌డీఓ కార్యాలయం వరకు అంగన్‌వాడీలు, మున్సిపాల్ వర్కర్స్, సివిల్ సప్లయీస్ హమాలీలు, శ్రీరామరెడ్డి, సత్యసాయి వాటర్ వర్కర్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం ఆర్‌డీఓ రాణీసుస్మితకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు రంగనాథ్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పాతక్క, తిప్పరమ్మ, మున్సిపాల్ యూనియన్ నాయకులు శివ, వన్నూరస్వామి, నాయకులు పాల్గొన్నారు.



ఆర్‌డీఓకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం



వైసీపల్లిలో తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్న సీడీపీఓ వనజ అక్కమ్మ

కంబదూరు: పుట్టిన శిశువుకు అరగంటలోపు ముర్రపాలు తాపించాలని, తద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీఓ వనజాఅక్కమ్మ తెలిపారు.సోమవారం మండలంలోని వైసీపల్లిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఐసీడీఎస్, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు ఔషధమన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: తల్లి పాలు బిడ్డకు అమృతం లాంటివి, బిడ్డ పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు తాపాలని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాభార్గవి అన్నారు. సోమవారం మండలంలోని శ్రీధరఘట్టలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లతో కలసి తల్లిపాల వారోత్సవాల ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని ఎమ్మార్సీ వద్దనున్న అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్, వైద్య సిబ్బంది గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై సోమవారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రాజేశ్వరి, అరుణ, హెల్త్ సూపర్ వైజర్ యశోద పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

వజ్రకరూరు: తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష అని సర్పంచు మోనాలిసా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు అన్నారు. సోమవారం వజ్రకరూరు, కొనకొండ్ల, చాబాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వైద్యాధికారి తేజశ్వి, ఏఎన్ఎం పద్మావతి, హెల్త్‌అసిస్టెంట్ బాబావలి,అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, సునీత, శివశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

కూడేరు: బాల్యం నుంచి ఆధ్యాత్మికత శక్తిని పెంపొందించుకోవాలని వైఎస్సార్ జిల్లాకు చెందిన రామకృష్ణ పరమహంస మఠం గురువు అర్చనానంద స్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే ఏమి చేయాలన్న దానిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చనానంద స్వామి విచ్చేసి, స్వామి వివేకానంద గురించి వివరించారు. సాధించాలన్న తపనను బలంగా మనసులో ఏర్పరుచుకోవాలని పిల్లలకు సూచించారు. జ్ఞాపక శక్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ప్రోద్బలంతో అక్రమ కేసు

గుమ్మఘట్ట: టీడీపీ నేతల ప్రోద్బలంతో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందుపై అక్రమ కేసు నమోదు చేశారు. వివరాలు..బీటీపీ గ్రామంలో ఆదివారం రాత్రి చిన్నపిల్లలు ఆడుకునే సమయంలో చంద్రకళ, సౌందర్య అనే మహిళలు గొడవపడ్డారు. ఒకరికొకరు తోసుకున్నారు. తోపులాటలో చంద్రకళ తలకు చిన్న గాయమైంది. టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై కేసులు నమోదు చేయించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సౌందర్య, బీటీపీ గోవిందు, లీలావతి, శివకుమార్, నవీన్‌కుమార్, రాంబాబులపై చంద్రకళ ఫిర్యాదు చేసింది. సౌందర్య కూడా ఫిర్యాదు చేయడంతో చంద్రకళ, ప్రియాంక, భాగ్యమ్మ, రవి చంద్ర, బాలయ్యపై ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు అత్యుత్సాహం ప్రదర్శించి, బీటీపీ గోవిందును సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్‌లో నిర్బంధించి, రాయదుర్గం కోర్టులో హాజరుపరిచారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

బొమ్మనహాళ్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారులు కుమారరాజా, గీతాభార్గవి అన్నారు. సోమవారం మండలంలోని లింగదహాళ్‌లో మలేరియా, డెంగీ, చికున్‌గన్యా తదితర లక్షణాలు, నివారణ చర్యలపై ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త వెంకటరమణ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల నియంత్రణ

రాయదుర్గంటౌన్: జాగ్రత్తలు, అప్రమత్తతో సీజనల్ వ్యాధులను అరికట్టొచ్చని రాయదుర్గం మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆవులదట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జుంజురాంపల్లిలో డెంగీ నివారణ అవగాహన ర్యాలీ చేశారు. హెచ్‌వీ నరసింహ, ఉపాధ్యాయులు లక్ష్మీ, అక్బర్ అలీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎంహళ్లిలో విష జ్వరాలు

కూడేరు: మండల పరిధిలోని ఎస్టీ కాలనీవాసులు విష జ్వరాలతో బాధపడుతున్నారు. 20 మంది దాకా జ్వరాలతో మంచానపడ్డారు. జ్వరం, ఒళ్లు,కీళ్ల నొప్పులు తగ్గడం లేదని జ్వర పీడితులు వాపోతున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

బొమ్మనహాళ్: వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారిణి మల్లీశ్వరి సూచించారు. సోమవారం మండలంలోని దేవగిరి క్రాస్ గ్రామంలోని అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, ఏఎన్ఎం గోవర్ధన, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రాయితీపై బిందు సేద్యం పరికరాలు

కంబదూరు: బిందు సేద్యం పరికరాలను రాయితీపై అందిస్తామని హెచ్‌ఓ గౌసియా సోమవారం తెలిపారు. బిందు సేద్యానికి ఐదెకరాల్లోపు ఉన్న సన్న, చిన్న కారు రైతులకు 90 శాతం, ఐదెకరాల పైబడి రైతులకు 70 శాతం, తుంపర్ల సేద్య పరికరాలకు 45 నుంచి 55 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు.

నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహించండి

కూడేరు: నిబంధనల మేరకు ఈ నెల 8న అన్ని స్కూల్స్‌లో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు జరపాలని మండల విద్యాధికారి–1 చంద్రశేఖర్ ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. సోమవారం కూడేరులోని ఎమ్మార్సీలో హెచ్ఎంలకు ఎస్ఎంసీ ఎన్నికల నిర్వాహణపై అవగాహన కల్పించారు. ఎంఈఓ మాట్లాడుతూ నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ –2 సాయికృష్ణ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు శివ, రమణ, ఆదిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రైతులు పంట నమోదు చేయించుకోవాలి

ఉరవకొండ: ప్రతి రైతూ పంటల నమోదు తప్పనిసరిగా చేయించాలని ఏడీఏ పద్మజ, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఏఓ శుభకర్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో పంట నమోదుపై వీఆర్ఓలు, ఆర్‌బీకే సిబ్బందికి అవగాహన కల్పించారు.

పంటలు నమోదు చేయించుకోవాలి

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ రైతులు పంట నమోదు చేయించుకోవాలని ఏడీఈ లక్ష్మానాయక్ తెలిపారు. మండలంలోని ఆర్‌బీ వంక గ్రామంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన వేరుశనగ పంటను ఏఓ మహేంద్రతో కలిసి ఏడీఈ క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు.

విడపనకల్లు: మండలంలో ఈ క్రాపు బుకింగ్ తప్పనిసరిగా చేయాలని తహసీల్దార్ సునీతాబాయి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో రెవెన్యూ సమావేశం భవనంలో ఏఓ పెన్నయ్య అధ్యక్షతన ఈక్రాపు బుకింగ్‌పై ఆర్ఎస్‌కే,వీఏఏ, ఎంపీఈఓ, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు.

ఈ పంట నమోదు తనిఖీ

వజ్రకరూరు: మండల పరిధిలోని గడేహోతూరులో ఈపంట నమోదును ఏఓ మధుకర్ సోమవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ ఇందు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

షాట్‌పుట్‌లో విద్యామందిర్ విద్యార్థిని ప్రతిభ

రాయదుర్గంటౌన్: షాట్‌పుట్ పోటీల్లో రాయదుర్గం సరస్వతీ విద్యామందిరం ఐదోతరగతి విద్యార్థిని కురుబ ఆశ్రిత ప్రతిభ చాటినట్లు పాఠశాల అధ్యక్షుడు పార్లాళ్ల ధనార్జున సోమవారం తెలిపారు. ఆశ్రితను హెచ్ఎం రాజేశ్వరి, కమిటీ కార్యదర్శి తుకారం, కోశాధికారి సాంబమూర్తి అభినందించారు.

వైభవంగా పల్లకీసేవ

ఉరవకొండ: స్థానిక మల్లేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివ,పార్వతుల ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీలో ఉంచి, ఆలయ వీధుల్లో పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ఫుడ్ ఫెస్టివల్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మైక్రో బయాలజీ విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. నాణ్యతతో, రుచికరమైన, ఇంట్లోనే తయారు చేసుకునే వంటకాలను విద్యార్థినీవిద్యార్థులు స్వయంగా చేసి, దాదాపు పది రకాల వంటలను ఫుడ్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు ఉంచారు. ప్రిన్సిపాల్ రఘురామమూర్తి మాట్లాడుతూ భవిష్యత్తులో ఫుడ్ టెక్నాలజీలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని స్టాళ్లను సందర్శించారు.

డీజీహెచ్ఎస్ఎస్ అధ్యక్షుడిగా కుమార్

ఉరవకొండ: దళిత, గిరిజనుల హక్కుల సాధన సమితి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎగ్గడి కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక హరిజన హాస్టల్ ఆవరణలో వ్యవస్థాపక అధ్యక్షుడు మీనుగ గోపాల్ అధ్యక్షతన ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా తలారి గంగాధర్, ఉపాధ్యక్షుడిగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా కిరణ్, కార్యదర్శిగా శ్రీకాంత్, కోశాధికారిగా ప్రభాకర్, అధికార ప్రతినిధులుగా నాగరాజు, ఎర్రిస్వామి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు

విడపనకల్లు: మండల కేంద్రం, కరకముక్కల గ్రామంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కెంగూరి ఎర్రిస్వామి, మండల నాయకుడు వెంకటేశులు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకరయ్య, అంజి, యువరాజు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరుడిపై సూర్య కిరణాలు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలోని స్వామి మూలవిరాట్‌ను సూర్య కిరణాలు తాకాయి. సోమవారం శ్రావణసోమవారం కావడంతో సూర్యకిరణాలు స్వామిని తాకడం శుభ సూచికమని భక్తులు తెలియజేశారు.

వాల్మీకి సేవా సమితి కార్యదర్శి రాజీనామా

రాయదుర్గం: రాయదుర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి కార్యదర్శిగా కొనసాగుతున్న ఎస్‌టీ సిద్దప్ప తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. అధ్యక్షులు బండి కిష్టప్పకు రాజీనామా లేఖను అందిస్తున్నట్లు తెలిపారు. తనకు 80 ఏళ్ల వయసు ఉండడంతో పదవికి న్యాయం చేయలేక పోతున్నానన్నారు.

దర్జాగా ఎర్రమట్టి దందా



యాపిల్ ఫ్యాక్టరీ సమీపంలోని పెద్ద వంకలో జేసీబీతో టిప్పర్‌లోకి ఎర్ర మట్టిని లోడ్ చేస్తున్న దృశ్యం


- సరిహద్దులో ఇష్టారీతిన ఎర్ర మట్టి తవ్వకాలు
- బరితెగిస్తున్న పచ్చ మాఫియా
- చోద్యం చూస్తున్న అధికారులు

రాయదుర్గం(డి హీరేహాళ్): అడిగేవారు లేరు.. అడ్డుకునేందుకు ఎవరూ ముందుకురారు.. పర్యవేక్షించాల్సిన వారు పత్తాలేరు. ఇంకేముందీ.. నియోజకవర్గంలోని కర్ణాటక సరిహద్దునున్న డీ హీరేహాళ్ మండలంలో ఎర్రమట్టి అక్రమ రవాణాదారులు చెలరేగిపోతున్నారు. పట్టపగలే ఈ దోపిడీ వ్యవహారం మూడు టిప్పర్లు, ఆరు ట్రాక్టర్లుగా సాగుతోంది. స్థానికంగా కూటమిగా ఏర్పడిన ఓ పచ్చ బ్యాచ్ అధికారంలోకి రాగానే అక్రమ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. బళ్లారి– బెంగళూరు జాతీయ రహదారి డీ హీరేహాళ్ మీదుగా వెళ్తోంది. ఈ రెండు ప్రాంతాలు పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందాయి. అక్కడ మట్టి అవసరాలను గుర్తించిన కొందరు తమ్ముళ్లు యథేచ్ఛగా తవ్వకాలు జరిపి అడ్డగోలుగా తరలిస్తున్నారు. బళ్లారి సిటీ కేవలం 15 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంది. అక్కడ ట్రాక్టర్ మట్టి రూ.4 వేలు, టిప్పర్ రూ.10 వేలు కొనుగోలు చేస్తున్నారు. కొందరు ఇసుక తరలింపును ఎంపిక చేసుకుంటే.. మరికొందరు మట్టి తరలించేందుకు సిద్ధమయ్యారు. జాతీయ రహదారికి కిలోమీటర్ దూరం యాపిల్ ఫ్యాక్టరీ సమీపంలోని పెద్ద వంకలో జేసీబీ ఏర్పాటు చేసి పట్టపగలే టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ పెద్ద ఎత్తున తరలించారు. ఎవరైనా అడిగితే గ్రామంలో అమ్మవారి ఆలయం వద్దకు మట్టి తరలిస్తున్నామని చెప్తున్నారు. ఆలయం పేరు చెప్పి ఎర్ర మట్టిని కొల్లగొడుతున్నారు.



ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఎర్రమట్టి

మట్టి దందాను అడ్డుకుంటాం



అనుమతుల్లేకుండా మట్టి, ఇసుక తరలిస్తే ఎంతటి వారైన సరే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ రోజే తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టాను. మట్టి తవ్వకం జరిపే ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తాం. ఎక్కడికి తోలుతున్నారు. ఎందుకు తరలిస్తారో విచారిస్తాం. ఎర్రమట్టి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. సిబ్బందికి కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తాం.

– అనిల్‌కుమార్, తహసీల్దార్, డీ హీరేహాళ్

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



ఉరవకొండ: ఉరవకొండ మండల తహసీల్దార్‌గా ఎస్. మహబూబ్‌బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన్ను అన్నమయ్య జిల్లా పీలేరుకు బదిలీ చేశారు. ప్రస్తుతం బదిలీల్లో భాగంగా ఉరవకొండ తహసీల్దార్‌గా నియమించారు. డీటీ గురుప్రసాద్, ఎన్నికల డీటీ మునీంద్ర, ఆర్ఐ రామకృష్ణ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

బొమ్మనహాళ్ తహసీల్దార్‌గా మునివేలు



బొమ్మనహాళ్: మండల తహసీల్దార్‌గా మునివేలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన రామాంజనమ్మ కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. బొమ్మనహాళ్ తహసీల్దార్‌గా మునివేలు జిల్లా కలెక్టర్ నియమించడంతో ఆయన సోమవారం బాధ్యతలు తీసుకున్నారు.

విడపనకల్లు తహసీల్దార్‌గా సునీతాబాయి

విడపనకల్లు: విడపనకల్లు మండల తహసీల్దార్‌గా సునీతాబాయి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. తహసీల్దార్ల సాధారణ బదిలీల్లో భాగంగా సునీతాబాయి విడపనకల్లుకు వచ్చారు.

తహసీల్దార్‌గా ఈశ్వరయ్య శెట్టి



శెట్టూరు: మండలంలో నూతన తహసీల్దార్‌గా ఈశ్వరయ్య శెట్టి బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరరెడ్డి, రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్ఓలు శ్రీనివాసులు, తిప్పేస్వామి, తిప్పేస్వామి, నాగరాజు, గంగన్న, వీఆర్ఏలు, మండలంలోని సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా అనిల్‌కుమార్

రాయదుర్గం(డి హీరేహాళ్): డీ హీరేహాళ్ మండల తహసీల్దార్‌గా అనిల్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ఈశ్వర్‌రెడ్డి సీఎల్ఆర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కొత్త తహసీల్దార్‌కు డీటీ బసవకుమార్, ఆర్ఐ రామాంజనేయులు సిబ్బందితో కలిసి స్వాగతం పలికారు.

కణేకల్లు తహసీల్దార్‌గా ఈ.ఫణికుమార్



కణేకల్లు: కణేకల్లు తహసీల్దార్‌గా ఈ.ఫణికుమార్‌ను సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఎన్నికల సమయంలో వైఎస్సార్ కడప జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన ఇందిరారాణి సొంత జిల్లాకు వెళ్లిన విషయం విదితమే. నంద్యాల జిల్లా పాణ్యంకు బదిలీపై వెళ్లిన ఈ.ఫణిమాకుమార్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. డీటీ రఘురామిరెడ్డి, ఆర్ఐ అశ్వర్థనారాయణతోపాటు వీఆర్వోలు కొత్త తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

బ్రహ్మసముద్రం తహసీల్దార్‌గా సుమతి



బ్రహ్మసముద్రం: బ్రహ్మసముద్రం తహసీల్దార్‌గా సుమతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్‌రెడ్డి, ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వోలు వీఆర్ఏలు, శుభాకాంక్షలు తెలిపారు.

వజ్రకరూరు తహసీల్దార్‌గా నయాజ్ అహమ్మద్



వజ్రకరూరు: వజ్రకరూరు మండల తహసీల్దార్‌గా ఎస్.నయాజ్ అహమ్మద్ నియమితులయ్యారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికా రు. తహసీల్దార్‌కు వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు పట్నా ఖాజా పీరా, ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బెంజిమెన్, జేవీవీ జిల్లాకార్యదర్శి మల్లికార్జున శుభాకాంక్షలు తెలియజేశారు.